## అధ్యాయము 45

# యోసేపు తన సహోదరులను తిరిగి కలుసుకొనుట

తన సహోదరులను పరీక్షించిన తరువాత, యోసేపు తనను తాను బహిర్గతము చేసికొనుటకు సిద్ధపడెను. చాలా కాలం క్రితము వారు చేసిన పనికి బాధపడడం అతడు పరిశీలించెను, మరియు బెన్యామీను పట్ల వారి ఆందోళనను కళ్లారా చూచెను. అందువలన, వారు ఇకను తనను బానిసత్వములోనికి అమ్మివేసిన ద్వేషముగల మరియు స్వార్థపూరిత వ్యక్తులు కాదని అతడు ఒప్పింపబడెను. వారు ఇప్పుడు నిజాయితీగల, కుటుంబమంతటి పట్ల ప్రేమకు ప్రేరేపింపబడిన మనుష్యులని ప్రదర్శించారు.

హత్తుకునే ఒక సన్నివేశంలో, యోసేపు తన సహోదరులకు తన గుర్తింపును బహిర్గతము చేసెను. దేవుడు వారి చెడు క్రియల నుండి మంచిని తీసుకువచ్చెనని అతడు మరలా హామీ ఇచ్చెను; తన దూరదృష్టితో, అనేక మందిని కరువునుడి కాపాడుటకు యోసేపును వాడుకొనెను. అప్పుడు యోసేపు తన సహోదరులను కనానుకు వెళ్లి వారి తండ్రితో ఈ వర్తమానము చెప్పమని సూచించెను. ఆ కుటుంబము ఐగుప్తులోని గోషెనుకు వచ్చి, కరువులో జీవించి ఉండుటకు ఆహ్వానింపబడెను (45:1-15). యోసేపు యొక్క ప్రణాళికకు ఫరో కుడా, కనానుకు బండ్లను పంపి ఆ కుటుంబం ఐగుప్తు ప్రయాణములో సహకరించి మద్దతు తెలిపెను (45:16-20). ఈ బండ్లు వారి తిరుగు ప్రయాణమునకు విస్తారమైన సదుపాయములతో నింపబడెను. ఆ సహోదరులు కనానుకు చేరి మరియు వారి తండ్రితో ఈ వర్తమానము చెప్పినప్పుడు, అతడు మొదట నిశ్చేష్టుడాయెను. అయితే యోసేపు పంపినవన్నీ చూచిన తర్వాత, యాకోబు తన కుమారుడు నిజముగా బ్రతికి యున్నాడని నమ్మెను. అతడు ఐగుప్తునకు వెళ్లి మరియు తాను చనిపోకముందు దీర్ఘకాలమునుండి పోగొట్టుకొనిన తన కుమారుని చూడ నిశ్చయించుకొనెను (45:21-28).

# యోసేపు తన సహోదరులకు తనెవరో బయలుపరచుట

# (45:1-15)

1అప్పుడు యోసేపు తన యొద్ద నిలిచినవారందరి యెదుట తన్ను తాను
అణచుకొనజాలక-నా యొద్దనుండి ప్రతి మనుష్యుని వెలుపలికి పంపివేయుడని
బిగ్గరగా చెప్పెను. యోసేపు తన సహోదరులకు తన్ను తాను
తెలియచేసికొనినప్పుడు ఎవరును అతని యొద్ద నిలిచియుండలేదు. 2అతడు
ఎలుగెత్తి యేడ్వగా ఐగుప్తీయులును ఫరో యింటివారును వినిరి. 3అప్పుడు
యోసేపు-నేను యోసేపును; నా తండ్రి యింక బ్రతికియున్నాడా అని అడిగినప్పుడు
అతని సహోదరులు అతని సముఖమందు తొందరపడి అతనికి ఉత్తరము
ఇయ్యలేకపోయిరి. 4అంతట యోసేపు-నా దగ్గరకు రండని తన సహోదరులతో
చెప్పినప్పుడు వారు అతని దగ్గరకు వచ్చిరి. అప్పుడతడు-ఐగుప్తునకు వెళ్లునట్లు
మీరు అమ్మివేసిన మీ సహోదరుడైన యోసేపును నేనే. 5అయినను నేనిక్కడికి
వచ్చునట్లు మీరు నన్ను అమ్మివేసినందుకు దుఃఖపడకుడి; అది మీకు సంతాపము
పుట్టింప నియ్యకుడి; ప్రాణరక్షణ కొరకు దేవుడు మీకు ముందుగా నన్ను పంపించెను.
6రెండు సంవత్సరములనుండి కరవు దేశములో నున్నది. సేద్యమైనను కోతయైనను
లేని సంవత్సరములు ఇంక అయిదు వచ్చును. మిమ్మును ఆశ్చర్యముగా రక్షించి
దేశములో మిమ్మును శేషముగా నిలుపుటకును 7ప్రాణముతో కాపాడుటకును
దేవుడు మీకు ముందుగా నన్ను పంపించెను. 8కాబట్టి దేవుడేగాని మీరు నన్నిక్కడికి
పంపలేదు. ఆయన నన్ను ఫరోకు తండ్రిగాను అతని యింటివారి కందరికి
ప్రభువుగాను ఐగుప్తు దేశామంతటిమీద ఏలికగాను నియమించెను. 9మీరు త్వరగా
నా తండ్రి యొద్దకు వెళ్లి అతనితో-నీ కుమారుడైన యోసేపు-దేవుడు నన్ను ఐగుప్తు
దేశమంతటికి ప్రభువుగా నియమించెను; నా యొద్దకురమ్ము, అక్కడ ఉండవద్దు;
10నీవు గోషెను దేశమందు నివసించెదవు, అప్పుడు నీవును నీ పిల్లలును నీ పిల్లల
పిల్లలును నీ గొర్రెలమందలును నీ పశువులును నీకు కలిగినది యావత్తును నాకు
సమీపముగా నుండును. 11ఇకను అయిదు కరవు సంవత్సరములు వచ్చును గనుక
నీకును నీ యింటి వారికిని నీకు కలిగినదంతటికిని పేదరికము రాకుండ అక్కడ
నిన్ను పోషించెదనన్నాడని చెప్పుడి. 12ఇదిగో మీతో మాటలాడుచున్నది నా నోరే అని
మీ కన్నులును నా తమ్ముడైన బెన్యామీను కన్నులును చూచుచున్నవి.
13ఐగుప్తులో నాకు కలిగిన సమస్త ఘనతను, మీరు చూచినది యావత్తు నా తండ్రికి
తెలియచేసి త్వరగా నా తండ్రిని ఇక్కడికి తీసికొనిరండని తన సహోదరులతో చెప్పి
14తన తమ్ముడైన బెన్యామీను మెడమీద పడి యేడ్చెను. బెన్యామీను అతని
మెడమీదపడి యేడ్చెను 15అతడు తన సహోదరులందరిని ముద్దు పెట్టుకొని
వారిమీద పడి యేడ్చిన తరువాత అతని సహోదరులు అతనితో మాటలాడిరి.

**వచనము 1.** యూదా ఇచ్చిన వీరోచిత, త్యాగపూరిత ప్రసంగము (44:18-34) ఏదైతే బెన్యామీను పట్ల మరియు వారి తండ్రి యాకోబు పట్ల ఉన్న నిజమైన ప్రేమ మరియు ఆందోళనను చూపించిన దానిని **యోసేపు** వినెను. **తన్ను తాను అణచుకొనజాలక**, యోసేపు పనివారికి: **ప్రతి మనుష్యుని వెలుపలికి పంపివేయుమని** ఆదేశించెను. ఈ రకమైన ఆజ్ఞ పురాతన ఐగుప్తులో క్రమమైనది ఎందుకనగా వారి సంస్కృతిలో ఉన్నత అధికారులు వారి బాధ్యతలను నిర్వర్తించేటప్పుడు భావోద్రేకాలను అదుపులో ఉంచుకొనవలెను. ముందు రెండు సార్లు యోసేపు తన కన్నీళ్లను దాచిపెట్టుటకు తన సహోదరులనుండి మరియు పనివారినుండి దూరముగా వెళ్లెను (42:24; 43:30). తన పనివారిని వెళ్లిపొమ్మని ఆదేశించడం వలన, **యోసేపు తన సహోదరులకు తన్నుతాను తెలియచేసికొనినప్పుడు ఎవరును అతని యొద్ద నిలిచియుండలేదు.**

**వచనము 2.** యోసేపు దీనిని వ్యక్తిగత మరియు ఇతరులకు తెలియని కుటుంబ కలయికలా చేయాలనుకున్నా, భావోద్రేకాలతో విచారము మరియు సంతోషముతో నింపబడి **ఎలుగెత్తి యేడ్వగా ఐగుప్తీయులును ఫరో ఇంటివారును వినిరి** (43:30 మీద వ్యాఖ్యానములు చూడుము).

**వచనము 3.** అతడు ప్రశాంతతను పొందిన తరువాత, యోసేపు వారి సహోదరులతో ముఖాముఖిగా మాట్లాడి మరియు తనెవరో చెప్పెను: **నేనే యోసేపును; నా తండ్రి యింక బ్రదికియున్నాడా** అని అడిగెను. ఇప్పటి వరకు, అతడు "వారి తండ్రి" గూర్చి విచారణ చేసెను (43:7, 27), కాని ఇప్పుడు అతడు "నా తండ్రి" అని అడిగెను. అతని సహోదరులు వారి చెవులను కాని కళ్లను కాని నమ్మలేకపోయెను. **అతని సహోదరులు అతని సముఖమందు తొందరపడి అతనికి ఉత్తరము ఇయ్యలేకపోయిరి.** "తొందరపడి" అనేది בָּהַל (*bahal*) నుండి వచ్చినది, ఎప్పుడైతే "ఒక వ్యక్తి ఊహించని, భయంకరమైన,ఘోరమైన విషయాన్ని ఎదుర్కొన్నప్పుడు వ్యక్తీకరించే భావోద్వేగం."[1] కొన్నిసార్లు ఇది సైనిక ప్రకరణము ఒక సైన్యాన్ని లేక దేశాన్ని స్వాధీనం చేసుకొనేటప్పుడు కలిగే భయముగా వర్ణించవచ్చు (నిర్గమ. 15:15; న్యాయాధి. 20:41; 2 సమూ. 4:1; యిర్మీయా. 51:32; యెహెజ్కేలు. 7:27; దాని. 11:44).

**వచనము 4.** ఆ సహోదరులు **యోసేపు**కు స్పందించుటకు ఇంకను మిక్కిలి భయపడెను; అందువల్ల అతడు మరలా, బ్రతిమిలాడి, **నా దగ్గరకు రండని** చెప్పెను. వారు అతనికి దగ్గరగా వచ్చిన తర్వాత, అతడు మరలా ధృవీకరించెను: **మీరు అమ్మివేసిన మీ సహోదరుడైన యోసేపును నేనే** (37:28 చూడుము). వారు అణచిపెట్టిన దోషముతో కలిపి, వారు చాలా కాలము నుండి దాచిన రహస్యము కూడా చివరికి బయటపడెను.

**వచనము 5.** అయితే, యోసేపు వెంటనే వారిపై ప్రతీకారం తీర్చుకొనే ప్రణాళిక తనకు లేదని తెలియచేసెను. అతడు గట్టిగా, **నేనిక్కడికి వచ్చునట్లు మీరు నన్ను అమ్మివేసినందుకు దుఃఖపడకుడి.** ఇది చెప్పుకోదగిన ప్రకటన. యోసేపు అతని

సహోదరులను పరీక్షించెను, మరియొక వ్యక్తి అయితే వారిని విపరీతముగా నిందించి, వారు పూర్తిగా నిరాశపడేవరకు వారి దోశారోపనతో వారిని తగలబెట్టి వుండేవారు. అలాంటి విధానంతో సమీపిస్తే అది యోసేపుకు అతని సహోదరులకు మధ్య శాశ్వతంగా చీలిక ఏర్పరచును; అది ఆ కుటుంబము మరలా తిరిగి కలుసుకొనుటను వాస్తవముగా అసాధ్యముగా చేయును. బదులుగా యోసేపు వారి దృష్టిని పాపముల నుండి దేవుని యొక్క కృపగల ప్రణాళిక వైపునకు నడిపించెను. అతడు **ప్రాణరక్షణ** కొరకు దేవుడు మీకు ముందుగా నన్ను **పంపించెను** అని చెప్పెను. **దేవుడు** నన్ను పంపించెను అనే మాట మూడు సార్లు చెప్పబడెను (45:5, 7, 8); ఇక్కడ ఇది బహూశా సాధారణముగా సహజము, అది ఐగుప్తీయులను మరియు చుట్టూ ప్రక్కల దేశములను అలాగే దేవుని నిబంధన ప్రజలను సూచిస్తుంది. వారందరు ఆకలి నుండి రక్షింపబడుదురు.

**వచనము 6.** యోసేపు తన వివరణను కొనసాగిస్తూ, ఆ **కరువు** ముగింపు కంటే ఆరంభమునకే దగ్గరగా వుందని వివరించి, ఎందుకంటే **రెండు సంవత్సరములనుండి** కరవు **దేశములో** నున్నది; **ఇంక అయిదు సంవత్సరములు** వచ్చును (41:29, 30). అతడు ఐగుప్తు మరియు చుట్టుప్రక్కల దేశముల సేద్యమునకు సంబంధించి ఒక విషాదమైన చిత్రమును గీసెను. రాబోయే కాలంలో సేద్యమైనను కోతయైనను లేదు; సేద్య ఉత్పత్తి ఆగిపోయే అంత తీవ్రముగా ఆ కరువు మారనుంది.

**వచనము 7.** అప్పుడు యోసేపు తాను చెప్పిన దానికి ఒకటి కలిపి మరలా చెప్పెను: **మిమ్మును ఆశ్చర్యముగా రక్షించి దేశములో మిమ్మును శేషముగా నిలుపుటకును ప్రాణముతో కాపాడుటకును దేవుడు మీకు ముందుగా నన్ను పంపించెను.** యోసేపు దీనిని ఇలా స్పష్టం చేసెను, దేవుని విధానములో, "ప్రాణమును కాపాడుటకు" (45:5) అనే ప్రాధమిక కారణముతో దేవుడు యోసేపును ఐగుప్తులో ఉంచెను- సాధారణ ప్రాణము కాదు, కాని "మీ కొరకు." తీవ్ర కరవు మధ్యలో, అబ్రాహాము సంతతి వారిని అతడు పోషించు చుండెను (15:13-16 చూడుము). దేవుడు "భూమిపై శేషమును [שְׁאֵרִית, *sh*$^{e}$*'erith*]" అబ్రాహాముకు తన వాగ్దానము నెరవేర్చుకు ఉంచెను.

**వచనము 8.** యోసేపు మరలా **దేవుడేగాని మీరు నన్నిక్కడికి పంపలేదు.** "దేవుడు" అనే వాక్యము "పంపెను" అనే మాటతో వాడబడెను. యోసేపు తన సహోదరులు తనపై అసూయపడి మరియు తనను వదిలించు కొనుటకు తనను బానిసత్వములోనికి అమ్మివేసినప్పుడు, దేవుడు తనను జీవితము మరియు విడుదల కొరకు ఉపయోగపడే ఒక పరికరముగా ఒక ఉన్నత ఉద్దేశము కలిగి ఉన్నాడని ఇది చెప్తుంది.

దైవ ప్రణాళిక యోసేపును **ఫరోకు తండ్రి**[2] గా చేయుట. ఈ పదజాలం అతడు రాజు యొక్క తెలివైన మరియు నమ్మకమైన పరిచారకుడిగా, ఒక తండ్రి తన కుటుంబమునకు వుండు నట్లు. ఇంకా, దేవుడు **ఇంటివారికందరికి** [ఫరో యొక్క] **ప్రభువు**గా చేసెను. రాజుకు తర్వాత అధిపతిగా, దేశ వ్యవహారాలు మరియు

ఖజానాలో నిధుల ఖర్చులు మీద అతనికి ఆధిపత్యం కలదు (41:40-44, 55). యోసేపు తనను తాను **ఐగుప్తు దేశమంతటిమీద ఏలికగాను** పిలచుకొనుచున్నాడు; అతడు ఏది ఆజ్ఞాపించినా, ప్రతి ప్రభుత్వ అధికారి మరియు ఐగుప్తు ప్రజలు వెంటనే తన ఆదేశాలకు విధేయత చూపాలి.

**వచనము 9.** యోసేపు తన మొదటి ప్రశ్నలో తన తండ్రిని చూడడానికి ఆత్రుతతో నుండెను 45:3లో "నా తండ్రి యింక బ్రదికియున్నాడా?" ఈ సమయంలో, తాను తన సహోదరులతో **మీరు త్వరగా నా తండ్రి యొద్దకు వెళ్లి** అని చెప్పుచున్నాడు. వారు యాకోబుతో ఇలా చెప్పుము, **నీ కుమారుడైన యోసేపు ఇలా చెప్పుచుండెను**; వారు యాకోబుకు స్పష్టంగా, తను చనిపోయాడనుకున్న తన కుమారుడైన యోసేపు, ఇంకా సజీవంగా ఉన్నాడని చెప్పవలెను. అప్పుడు వారు యోసేపు నుండి ఆ సందేశమును చేరవేయవలెను: **దేవుడు నన్ను ఐగుప్తు దేశమంతటికి ప్రభువుగా నియమించెను, నా యొద్దకు రమ్ము, అక్కడ ఉండవద్దు.**

**వచనము 10.** ముసలివాడైన ఈ తండ్రి గురించి చాలా ప్రశ్నలు సహజముగా కలగవచ్చు, మరియు అతడు తన వంశము నంతటిని ఐగుప్తు లాంటి క్రొత్త దేశమునకు తరలించడానికి అనుమానించవచ్చు. యోసేపు యాకోబుకు ఇలాంటి ప్రశ్నలు వస్తాయని ముందుగా ఊహించెను: "మనము ఎక్కడ నివసించెదము?"; మన సంతతిలో ప్రతివారిని ఎలా పోషించగలము? అందువలన, యోసేపు తన సహోదరులను వారి తండ్రికి వారి సంతతికి కావలసినవన్నీ తాను చూచుకొందునన్న నమ్మకము కలిగించమని ఆదేశించెను: **నీవు గోషెను దేశమందు నివసించెదవు.** యోసేపు దానికి ప్రోత్సాహకము కలిపెను: **నీవును నీ పిల్లలును నీ పిల్లల పిల్లలును నీ గొర్రెమందలును నీ పశువులును నీకు కలిగినది యావత్తును నాకు సమీపముగా నుండును.** "గోషెను దేశము" అనే ఖచ్చితమైన ప్రాంతము, ఎక్కడైతే యాకోబు మరియు కుటుంబమంతా నివసించాలనుకుంటుందో అది అనిశ్చితము. "గోషెను" అని పిలవబడే ప్రాంతము యెహోషువా లో చెప్పబడెను (యెహో. 10:41; 11:16; 15:51); కాని ఇశ్రాయేలీయులు ఆ పేరును ఐగుప్తు నుండి తెచ్చి కనానులో వారు వుండిన స్థలమునకు ఇచ్చివుండవచ్చు. చాలా మంది పండితులు గోషెను తూర్పు నదీ ప్రాంతములో ఐగుప్తులో, Wadi Tumilat సమీపములో ఉండవచ్చునని ఆలోచించారు. ఇది తర్వాత ప్రకటనలో 47:11 చెప్పిన యోసేపు అతని కుటుంబము "రామెసేసను దేశము"[3] లో నివసించెను అన్న దానితో ఏకీభవిస్తుంది. ఈ ప్రదేశము "సేద్యము చేయడానికి సరిపడదుగాని మందను మేపుటకు సరియైనది, ఇది యోసేపు తన తండ్రి ఇంటివారందరు అక్కడ ఎందుకు ఉండాలనుకున్నాడో వివరిస్తుంది"[4] (46:31–47:6. చూడుము).

**వచనము 11.** ముసలివాడైన తన తండ్రి ఐగుప్తుకు ప్రయాణము చేయడముపై సందేహిస్తాడని యోసేపు అర్థము చేసుకున్నాడు. కుటుంబమునంతటిని-స్త్రీలు మరియు చిన్న పిల్లలు, వారి పశువులతో కలిపి- ఐగుప్తుకు తరలించడం కష్టమైన పని. అయితే, యోసేపు వ్యాపిస్తున్న కరువు నుండి వారు రక్షింపబడాలంటే వారు

అక్కడి నుండి తరలి రావడం అవసరమని తెలుసుకున్నాడు. అతడు సంవత్సరాల కరువు బట్టి వారించడానికి ఒక గంభీరమైన వాగ్దానము చేశాడు: **ఇకను అయిదు కరవు సంవత్సరములు వచ్చును గనుక నీకును నీ యింటి వారికిని నీకు కలిగినదంతటికిని పేదరికము రాకుండ అక్కడ నిన్ను పోషించెదను అన్నాడు.**

**వచనము 12.** ఈ పరిస్థితిలో, యోసేపు తన సహోదరులు, వారి స్వంత కళ్లతో తాను సజీవముగా ఉన్నాడని దూతల వలె అలాగే సాక్షులుగా కూడా వుండాలని వివరించెను. దానికితోడుగా, **బెన్యామీను**, తన ఏకైక **సహోదరుడు**, తన తండ్రికి యోసేపు సజీవముగా ఉన్నాడని సాక్ష్యము ఇవ్వవలెను. యాకోబు ఇతరులను నమ్మకపోయినా, తన చిన్న కుమారుని ఖచ్చితముగా నమ్మును.

యోసేపు తన **నోరే** వారితో **మాటలాడుచున్నదని** వారికి తెలియజేసెను. ముందు సంభాషణలలో, అతడు అతని సహోదరులతో మాట్లాడినప్పుడు ఒక ద్విభాషి ఉండెను (42:23). అయితే, ఇప్పుడు, ఎందుకంటే అతను నిజముగా వారి సహోదరుదని తెలుసుకొనుటకు యోసేపు వారితో వారి స్వంత భాషలో (హెబ్రీ) మాటలాడుచుండెను.[5]

**వచనము 13.** దీని తర్వాత, యోసేపు తన సహోదరులకు చివరి సూచన నిచ్చెను: **ఐగుప్తులో నాకు కలిగిన సమస్త ఘనతను నా తండ్రికి తెలియచేయుడి**- అదియేమిటంటే, ఐశ్వర్యము మరియు అతడు సంపాదించిన అధికారము. యోసేపు వారి స్వంత కన్నులతో వారు చూచిన **దంతయు** చెప్పుమని బతిమాలెను.

యోసేపు, **త్వరగా నా తండ్రిని ఇక్కడికి తీసికొనిరండని** చెప్పెను. అతడు తన తండ్రిని చూచుటకు మరియు సజీవముగా ఉంచుటకు ఆత్రుత పడుచుండెను. “తీసికొని రండి” (יָרַד, *yarad*) అనే క్రియ 42:38 నుండి మరలా చెప్పబడెను. అక్కడ యాకోబు బెన్యామీను ఐగుప్తునకు పోయి (*yarad*) తిరిగి రాలేదని ఆందోళన చెంది, తనను మృతుల లోకములోనికి దుఃఖముతో పోవు (*yarad*) నట్లు చేయును. దానికిబదులుగా, యోసేపు తన తండ్రిని ఐగుప్తునకు తీసికొని వచ్చి జీవితమును సంతోషముగా గడపవలెనని కోరుచున్నాడు.[6]

**వచనము 14.** ఈ సమావేశం ముగింపులో, **యోసేపు తన తమ్ముడైన బెన్యామీను మెడమీద పడి యేడ్చెను; బెన్యామీను** కూడా తన సహోదరుని ప్రేమను తాను కూడా చూపించి అతని **మెడమీద** పడి యేడ్చెను.

**వచనము 15.** అప్పుడు యోసేపు తన సహోదరులనందరిని ముద్దు పెట్టుకొని వారి మీద పడి యేడ్చెను; అయితే ఆ పెద్ద సహోదరులు ఏడ్చినట్లు వాక్యము చెప్పలేదు, వారు అతనిపై అనుమానపడిరి. బదులుగా, తరువాత అతని సహోదరులు అతనితో మాటలాడిరి అని చెప్పబడెను. ఈ జాగ్రత్త ఆ సహోదరులు బెన్యామీను తప్ప అతని కృపగల వైఖరిని మంచిగా అంగీకరించుటకు సిద్ధముగా లేరు. వారి తండ్రి మరణము తర్వాత యోసేపు తన నిజమైన భావాలను బయటపెట్టి పగను తీర్చుకొనునేమో అని భయపడుట వారి అనిశ్చితిని కనుపరచెను (50:15-18).

## ఆ కుటుంబము ఐగుప్తుకు వచ్చుటకు ఫరో యొక్క ఆహ్వానము (45:16-20)

**[16]యోసేపుయొక్క సహోదరులు వచ్చిన వర్తమానము ఫరో యింటిలో వినబడెను. అది ఫరోకును అతని సేవకులకును ఇష్టముగా నుండెను. [17]అప్పుడు ఫరో యోసేపుతో ఇట్లనెను-నీవు నీ సహోదరులను చూచి-మీరీలాగు చేయుడి, మీ పశువులమీద బరువులు కట్టి కనాను దేశమునకు వెళ్లి [18]మీ తండ్రిని మీ యింటివారిని వెంటబెట్టుకొని నా యొద్దకు రండి; ఐగుప్తు దేశమందలి మంచి వస్తువులను మీకిచ్చెదను, ఈ దేశాముయొక్క సారమును మీరు అనుభవించెదరు [19]నీకు ఆజ్ఞయైనది గదా? దీని చేయుడి, మీ పిల్లలకొరకును మీ భార్యలకొరకును ఐగుప్తులోనుండి బండ్లను తీసికొనిపోయి మీ తండ్రిని వెంటబెట్టుకొని రండి. [20]ఐగుప్తు దేశమంతటిలోనున్న మంచి వస్తువులు మీవే అగును గనుక మీ సామాగ్రిని లక్ష్యపెట్టకుడని చెప్పుమనగా**

**వచనములు 16-18.** యోసేపు తన సహోదరులకు కనానుకు తిరిగి వెళ్లి తన తండ్రికి తన ఐశ్వర్యం మరియు ఐగుప్తులో ఉన్నత అధికారముగల స్థానము గూర్చి చెప్పుమని ఇప్పటికే సూచించెను. అతడు వారిని తన తండ్రిని ఒప్పించి మరియు కుటుంబమునంతటిని ఐగుప్తునకు రప్పించి మరియు తనకు సమీపముగా నుంచుకొని మిగతా కరవు సంవత్సరములలో వారిని పోషించుటకు ఇష్టపడెను.

ఎప్పుడైతే **ఫరో యోసేపు యొక్క సహోదరులు** వచ్చిన **వర్తమానము** అందుకున్నాడో, అతడును **అతని సేవకులును ఇష్టపడెను** (45:16). అందువలన, **ఫరో** యోసేపుతో నీవు నీ సహోదరులతో మీ పశువులమీద బరువులు కట్టి **కనాను దేశమునకు** వెళ్లి మీ తండ్రిని మీ ఇంటివారిని వెంటబెట్టుకొని ఐగుప్తుకు రండని చెప్పుము (45:17). ఈ రీతిగా, ఫరో తన రాజ్య ఉన్నతాధికారి యొక్క ఆహ్వానమును ఆమోదించెను. అతడు యోసేపును తన సహోదరులను [వారి] **తండ్రిని మరియు** [వారి] **యింటివారిని తనయొద్దకు** రమ్మని ఆదేశించమని కోరెను (45:18). ఇంకను, ఫరో **ఐగుప్తు దేశము యొక్క మంచి**[7] **వస్తువులను మీకిచ్చెదను** అని, **ఈ దేశము యొక్క సారము అనుభవించెదరని** వాగ్దానము చేసెను. "దేశము యొక్క మంచి వస్తువులు" అంటే వారు ఐగుప్తులో మంచి ప్రదేశమును పొందుకుంటారని కాదు; కాని ఈ వాక్యము వారు ఆ దేశములోని మంచి ఉత్పత్తిని తిందురని, లేక ఆ దేశము యొక్క "సారము".

**వచనములు 19, 20.** ఫరో అలాంటి ఉదారమైన అవకాశం వారికీ నమ్మశక్యముగా కనపడదని తెలుసుకొని, యోసేపును వారికి ధృఢమైన రాజఆజ్ఞను ఇవ్వమని సూచించెను: **మీ పిల్లలకొరకును మీ భార్యలకొరకును ఐగుప్తులోనుండి బండ్లను తీసికొనిపోయి మీ తండ్రిని వెంటబెట్టుకొని రండి** (45:19).

దానికి తోడు, యోసేపు ఇలా చెప్పెను, **ఐగుప్తు దేశమంతటిలోనున్న మంచి వస్తువులు మీవే అగును గనుక మీ సామాగ్రిని లక్ష్యపెట్టకుడి** (45:20). 18వ వచనములో ఉన్నట్లుగా, అతడు ఐగుప్తు యొక్క మంచి వస్తువులను మీకిచ్చే అవకాశమున్నదని వారికి వాగ్దానము చేసెను.

కొందరు ఫరో యోసేపు యొక్క సహోదరులకు మరియు వారి కుటుంబమంతటికి ఇచ్చిన ఉదారతను బట్టి ప్రశ్నలడిగెను ఎందుకంటే అది విదేశీయుల పట్ల సాధారణమైన ఐగుప్తు విరోధతకు సరిపడదు. అయినప్పటికీ, ఈ రాజు ఒక హెబ్రీయుని ఏడు సంవత్సరాల సమృద్ధి దాని తర్వాత కొన్ని సంవత్సరాల భయంకర కరువు గూర్చి అంచనాకు సమస్తమును ఇచ్చెను. యోసేపు యొక్క తెలివైన సంసిద్ధతను బట్టే ఐగుప్తు ఈ భయంకరమైన కరువును తప్పించుకొనగలిగెను. ఇంకా, ఫరో తన దేశము యొక్క ప్రాణము నిలిపే ఉత్పత్తిని చుట్టూ ప్రక్కల దేశములకు కూడా పంచు ఉదారత వలన అనుమానములేకుండా అది విదేశీయులపై కూడా ఒక మంచి ప్రభావము చూపెను. ఇది అనేక అపరిచితుల కటాక్షము గెలిచి, ఫరోను మరియు అతని ప్రజలను వేరుగా చూడడము మొదలుపెట్టెను: పురాతన ప్రపంచములో ఐగుప్తు దయగల "రొట్టెల గంప"గా తెలియపరచబడెను.[8]

## యోసేపు ఇచ్చిన సామాగ్రి మరియు యాకోబు వద్దకు ఆయన సహోదరుల తిరోగమనము (45:21-28)

**[21]ఇశ్రాయేలు కుమారులు ఆలాగుననే చేసిరి. యోసేపు ఫరోమాట చొప్పున వారికి బండ్లను ఇప్పించెను; మార్గమునకు ఆహారము ఇప్పించెను. [22]అతడు వారికి రెండేసి దుస్తుల బట్టలు ఇచ్చెను; బెన్యామీనుకు మూడువందల తులముల వెండియును ఐదు దుస్తుల బట్టలు ఇచ్చెను; [23]అతడు తన తండ్రి నిమిత్తము ఐగుప్తులో నున్న మంచి వస్తువులను మోయుచున్న పది గాడిదలను, మార్గమునకు తన తండ్రి నిమిత్తము ఆహారమును, ఇతర ధాన్యమును తినుబండములను మోయుచున్న పది ఆడు గాడిదలను పంపెను. [24]అప్పుడతడు తన సహోదరులను సాగనంపి వారు బయలుదేరుచుండగా–మార్గమందు కలహపడకుడని వారితో చెప్పెను. [25]వారు ఐగుప్తునుండి బయలుదేరి కనాను దేశమునకు తమ తండ్రియైన యాకోబు నొద్దకు వచ్చి [26]యోసేపు ఇంకా బ్రదికియుండి ఐగుప్తు దేశమంతటిని ఏలుచున్నాడని అతనికి తెలియచేసిరి. అయితే అతడు వారి మాట నమ్మలేదు గనుక అతడు నిశ్చేష్టుడాయెను. [27]అప్పుడు వారు యోసేపు తమతో చెప్పిన మాటలన్నిటిని అతనితో చెప్పిరి. అతడు తన్ను ఎక్కించుకొని పోవుటకు యోసేపు పంపిన బండ్లు చూచినప్పుడు వారి తండ్రియైన యాకోబు ప్రాణము తెప్పరిల్లెను. [28]అప్పుడు ఇశ్రాయేలు–ఇంతే చాలును, నా కుమారుడైన**

**యోసేపు ఇంక బ్రదికియున్నాడు, నేను చావకమునుపు వెళ్లి అతని చూచెదనని చెప్పెను.**

**వచనము 21. ఇశ్రాయేలు** [యాకోబు] **కుమారులు యోసేపు** తమకు చెప్పిన సూచనల ప్రకారము అనుసరించారు. అయన వారికి **బండ్లను (ఫరో** ఆజ్ఞాపించినట్లుగా) సమకూర్చాడు మరియు కనాను దేశమునకు వెళ్లునప్పుడు **మార్గమునకు** సరిపడు **ఆహారము ఇప్పించాడు.**

**వచనము 22.** ఫరో ఇచ్చిన ఆజ్ఞను మించి, యోసేపు తన సహోదరులను క్షమించాడు అనేదానికి ఋజువుగా అధికమైన బహుమానాలను ఇచ్చాడు: **అతడు వారికి రెండేసి దుస్తుల బట్టలు ఇచ్చెను.** ఈ దుస్తులు బహుశా కాపరులు కొనుటకు నోచుకోలేని విలువైన దుస్తులు అయి ఉండవచ్చు. ఖచ్చితముగా వారు ఇక్కడ కొంత వ్యంగ్యాన్ని చూసారు: యాకోబు యోసేపుకు ఇచ్చిన విలువైన అంగీ ఒకటి తన సహోదరుల కోపానికి ఆయనను గురిచేసి "ఇరువది వెండి నాణెములకు" ఆయనను అమ్మినట్లు చేసింది (37:28).

యోసేపు తన అన్నలందరితో పోల్చితే తన **బెన్యామీనుకు** "అయిదంతలు" ఎక్కువ ఆహారమును విందు చేసినప్పుడు ఇచ్చియుండగా (43:34), ఇప్పుడు తన తమ్మునికి అదేవిధంగా **మూడువందల తులముల వెండియును ఐదు దుస్తుల బట్టలు ఇచ్చాడు.** ఐగుప్తులో ఒక శక్తివంతమైన నాయకుడుగా, యోసేపు జ్యేష్ఠత్వపు హక్కును (లేదా జ్యేష్ఠత్వమును) నిర్లక్ష్యము చేసి ప్రత్యేకమైన ఆశీర్వాదమును పెద్దవానికి కాకుండా చిన్నవానికి ఇచ్చుటకు ఆయనకు అధికారము ఉంది; మరియు ఆయన చేయుటకు ఎంచుకున్నది ఇదే.[9] తన సొంత సహోదరుని చూచి అతడు ఇంకను క్షేమముగానే ఉన్నాడు అని తెలుసుకొనుటకు ప్రత్యేకంగా ఆనందంగాను మరియు కృతజ్ఞుడుగాను ఉన్నాడు.

ఒకప్పుడు తనను చాలా చెడ్డగా చూసిన తన సహోదరులు ఇప్పుడు మారారు అని అనుటకు రెండు సంఘటనలు యోసేపుకు నిశ్చయతను ఇచ్చాయి. మొదటిది, ఆ వెండి గిన్నె (44:9) ఎవరివద్ద ఉందో, ఆఖరుకు అది బెన్యామీను దగ్గరే ఉంది (44:12, 16) అనుకోండి, అతనితో మిగతా వారందరు శ్రమననుభవించుటకు సిద్ధముగా ఉన్నారు. రెండవది, యోసేపును బానిసత్వమునకు అమ్మివేయమని ఇతరులను ప్రోత్సహించిన యూదా ఇప్పుడు బెన్యామీను తన తోబుట్టువులతో ఇంటికి వెళ్లి తన తండ్రితో ఉండుటకు అనుమతించబడినట్లయితే, అతని స్థానంలో జీవితాంతము బానిసగా ఉండుటకు ఇష్టపడ్డాడు (44:32-34). ఇదంతయు కూడా తన సహోదరుని పట్ల వారు చూపిన అసూయ మరియు ఏహ్యాభావము ఎంతటి వినాశనాత్మకమైనదో అనే బాధాకరమైన పాఠాన్ని సహోదరులందరూ నేర్చుకున్నారని సూచిస్తున్నాయి; కాబట్టి యోసేపు తన కనికరమును, క్షమాపణను, మరియు సంరుద్ధియైన ఆశీర్వాదములను వారిపట్ల కనుబరచాడు.

**వచనము 23.** ఆఖరుగా, యోసేపు **తన తండ్రికి** కొన్ని బహుమతులను

పంపాడు. **తన తండ్రి నిమిత్తము ఐగుప్తులో నున్న మంచి వస్తువులను మోయుచున్న పది గాడిదలను** పంపుట ద్వారా యాకోబును ఆ ప్రయాణము కొరకు చాలా విలాసవంతంగా సిద్ధపరుస్తున్నాడు. దీనికి తోడు, ఆయన ఇంకా **తన తండ్రి నిమిత్తము ఆహారమును, ఇతర ధాన్యమును తినుబండములను మోయుచున్న పది ఆడు గాడిదలను** కూడా **పంపాడు.** ధాన్యమును మరియు ఇతర ఆహార సామగ్రిని పుష్కలంగా పంపడమనేది ఐగుప్తు యొక్క ముఖచిత్రాన్ని ఒక సమృద్ధి కలిగిన దేశంగా ఉద్ఘాటిస్తుంది. ఎంతో కాలంగా తప్పిపోయిన కుమారుడు, ప్రస్తుతం ఐగుప్తు దేశములో నాయకుడుగా ఉన్నవాడు, ఆయనకు మరియు ఆయన కుటుంబమునకు కూడా – కేవలం వారు ప్రయాణించువరకు మాత్రమే కాక, వారు గోషెనులోనికి వచ్చునప్పుడు కూడా – సమకూర్చగలడని యాకోబును ఒప్పించుటకు ఇవి దోహదపడతాయి.

**వచనము 24.** కనాను దేశమునకు **తన సహోదరుల** తిరోగమనమునకు ఏర్పాట్లు చేసిన తరువాత, యోసేపు [వారిని] **సాగనంపాడు**; కాని, **వాళ్లు వెళ్లుచుండగా** వారికి ఒక ఆఖరు ఆజ్ఞను ఇచ్చాడు: **మార్గమందు కలహపడకుడని** వారితో చెప్పాడు. వారు తన దృష్టి నుండి బయటకు వెళ్లిన వెంటనే యోసేపును బంధించిన విషయంలో సహోదరుల మధ్య కలహము మరియు నిందించుకోవడం జరుగుతాయి అని తన సహోదరులను గూర్చి యోసేపుకు బాగుగా తెలిసేయున్నది. నిజానికి, యోసేపు తన్ను తాను వారికి పరిచయం చేసుకున్నప్పుడు కూడా ఇటువంటి ప్రవర్తనే వారి మధ్య ఉండటం చూసాడు (42:22), మరియు "యోసేపు [ఇంకను] బ్రదికియున్నాడు" (45:26) అనే మాటను తన తండ్రి వినుట ద్వారా పొందే ఆనందమును తన సహోదరులు పాడుచేయకూడదు అని యోసేపు అనుకున్నాడు.

తన సహోదరులకు ఈ విధంగా హెచ్చరిక చేయుటకు యోసేపుకున్న మరొక కారణమేమనగా, ఐగుప్తులో యోసేపు బ్రదికియున్నాడు అని తన తండ్రితో చెప్పునప్పుడు, తనకు ఇష్టమైన కుమారుని అపహరణకు సంబంధించి రెండు దశాబ్దాల పాటు వారు కప్పి ఉంచిన ఆ నిజాన్ని బట్టి వారు తన తండ్రి క్షమాపణను చూడాలి గనుక. యోసేపు వారిపై కక్షను పెంచుకొని తరువాత వారిపై పగ తీర్చుకుంటాడేమో అని సహోదరులు భయపడ్డారు. ఆయన వారిని అప్పటికే క్షమించాడు (45:1-8), కాని క్షమించడం అనునది మరియు క్షమాపణను అనుభవించడం అనునది ఈ రెండు ఒకటే కావు. వారు తమను తాము క్షమించుకొనుటకు చాలా కష్టపడి ఉంటారు, మరియు యోసేపు తన క్షమాపణలో నిజాయితీగా ఉన్నాడని వారికి నమ్మకం కలగడం లేదు. సంవత్సరాల తరువాత (47:9, 28 చూడండి) వారి తండ్రి మరణించినప్పుడు, యోసేపును బానిసత్వములోనికి అమ్మివేసినందుకు గాను ఆయన వారిపై పగ తీర్చుకుంటాడేమోనని వారు చాలా భయపడిపోయారు (50:15-21).

**వచనములు 25, 26.** యోసేపు యొక్క సూచనలను అనుసరించి,

సహోదరులు **ఐగుప్తు నుండి బయలుదేరి కనాను దేశమునకు తమ తండ్రియైన యాకోబునొద్దకు** వచ్చారు. వారు వచ్చినప్పుడు, **యోసేపు ఇంకా బ్రదికియుండి ఐగుప్తు దేశమంతటిని ఏలుచున్నాడు** అని వెంటనే ఆయనతో చెప్పారు. యోసేపు ఐగుప్తులో ఎందుకు ఉన్నాడు లేదా చాలా సంవత్సరాల క్రితం ఏమి జరిగింది అని యాకోబు తన కుమారులను ప్రశ్నించినట్లుగా ఈ కథకుడు ఏమియు చెప్పుటలేదు. ఆ పెద్ద మనిషి ఇటువంటి ప్రశ్నలన్నీ అడుగుటకు లేదా ఆ సమయములో ఈ ప్రశ్నలు అడుగుటకు వీలుపడనంతగా అత్యానందభరితుడై ఉన్నాడని ఈ పరిహరించడం మనకు తెలియజేస్తుంది. యోసేపు బ్రదికియున్నాడు అని వారు చేసిన ప్రకటన యాకోబుకు అంగీకరించుటకు చాలా కష్టమైనదే, కాని యోసేపు ఐగుప్తులో ఏలుచున్నాడు అనే మాట యాకోబును **నిశ్చేష్టుడిని చేసి** అవిశ్వాసంలోనికి నెట్టింది. 37వ అధ్యాయంలో యాకోబు తన కుమారులు చేసిన మోసాన్ని నమ్మాడు; కాని ఇప్పుడు, యోసేపు బ్రదికియున్నాడు అనే సత్యాన్ని ఆయనకు చెప్పినప్పుడు, **అతడు వారి మత నమ్మలేదు.**

**వచనము 27.** యోసేపు ఇంకను బ్రదికే ఉన్నాడు అని తమ తండ్రిని ఒప్పించుటకుగాను, సహోదరులు అందరు ఆయనతో సుదీర్ఘ చర్చ చేశారు, ఈ చర్చలో వారు **యోసేపు తమతో చెప్పిన మాటలన్నిటిని అతనితో చెప్పారు.** తన కుమారులకు అబద్ధమాడుట అనే చరిత్ర ఉన్నదని యాకోబుకు తెలుసు కాబట్టి (34:7-31), ఆయన చాలా విమర్శనాత్మకంగా ఉన్నాడు. కాని, **అతడు తన్ను ఎక్కించుకొని పోవుటకు యోసేపు పంపిన బండ్లు చూచినప్పుడు**, ఆయన నమ్మాడు. ఆ బండ్లు – వాటితో ఇరువది గాడిదలు, ధాన్యము, విలువైన దుస్తులు, మరియు మూడు వందల తులముల వెండి (45:21-23)– ఇవన్ని కూడా ఆ సహోదరులు సంపన్నుడైన మరియు ఔదార్యమును కలిగిన ఒక వ్యక్తిని కలిశారు అనుటకు అనుమానించదగని సాక్ష్యముగా ఉన్నాయి. యోసేపు బ్రదికియుండి ఐగుప్తు దేశమును ఏలుచున్నాడని సహోదరులు చెప్పిన అద్భుత కథను ఈ వస్తువులు నిరూపిస్తున్నాయి. ఈ వార్త కారణంగా, **వారి తండ్రియైన యాకోబు ప్రాణము తెప్పరిల్లెను.** దరిదాపుగా ఇరువది సంవత్సరాల క్రితం, యోసేపు మరణించి ఉంటాడు అని నమ్మినప్పుడు, యాకోబు బిగ్గరగా ఏడ్చి "ఓదార్పు పొందనొల్లక" ఉన్నాడు (37:34, 35). ఇప్పుడు, ఆ బరువైన భారము తన నుండి లేపబడింది.

**వచనము 28.** ఈ నూతన నిరీక్షణ **ఇశ్రాయేలుకు, ఇంతే చాలును, నా కుమారుడైన యోసేపు ఇంక బ్రదికియున్నాడు, నేను చావకమునుపు వెళ్లి అతని చూచెదనని** చెప్పునట్లు చేసింది. యాకోబు తగువిధంగానే ఇక్కడ "ఇశ్రాయేలు" అని పిలువబడ్డాడు ఎందుకంటే యెహోవా దూత ద్వారా ఆయనకు ఇయ్యబడిన ఈ క్రొత్త పేరు (32:28-30) క్రొత్త ఆశను మరియు తనకును తన కుటుంబమునకును ఒక క్రొత్త గమనమును సూచించింది. అబ్రాహాము యొక్క సంతానమైన వీరు ఐగుప్తు అనే ఒక అపరిచిత దేశములో ఒక నూతన సాహసమును చేసే గవిటిదగ్గర నిలబడియున్నారు; మరియు ఆ దేశములో స్థిరపడాలని వారు తీసుకున్న

నిర్ణయము ఇశ్రాయేలు చరిత్ర యొక్క ఆరంభానికి శ్రీకారం చుడుతుంది.

# అన్వయము

## సంధిచేయడమనే దైవసంకల్పికమైన క్రియ (45:1-15)

మనము పడిపోయిన లోకంలో జీవిస్తున్నాము గనుక, ఇతరులతో మనకుండే సంబంధాలు పరిపూర్ణతకు నోచుకోనివిగా ఉంటాయి. గర్వము, అసూయ, మరియు మోసము అనే పాపములు ఇద్దరు మనుష్యుల మధ్య ఒక అడ్డంకిని తేగలవు. 45:1-15లో యోసేపు తన సహోదరులను క్షమించడం అనేది దెబ్బతిన్న సంబంధాలు బాగుచేయబడగలవు – అంటే సంధి అనునది సాధ్యపడుతుంది అనే విషయాన్ని వెల్లడి చేస్తుంది.

*సంధి చేసే క్రమంలో జాలి అనునది మొదటి దశ.* 45వ అధ్యాయము మొదటి అర్థభాగములో ఎక్కువ శాతము యోసేపు తన సహోదరులతో చేసిన ఉపన్యాసాన్ని తెలుపుతుంది. యాకోబు కుమారులకు ఇది భూమిని కంపింపజేసే ఒక ఘడియ మరియు యోసేపుకు అయితే భావోద్వేగమైన సమయము. తనను తన సహోదరులకు బయలుపరచుకొనుచుండగా ధారాళంగా కన్నీరు వస్తుంది అని ఆయనకు తెలుసు (43:30), కాని శక్తివంతమైన ఒక ఐగుప్తీ నాయకునికి అటువంటి ప్రవర్తన తగనిది అని తన యింటిలోని దాసులు భావిస్తారు అని కూడా ఆయనకు తెలుసు. కాబట్టి, తన సహోదరులతో కొంత ఏకాంత సమయమును గడుపుటకు గాను వారినందరినీ అక్కడనుండి బయటకు వెళ్లమని ఆదేశించాడు. యోసేపు యొక్క భావోద్వేగాల స్పందన ఎంతటి బలమైనవి అంటే ఇకను వాటిని ఆయన నియంత్రించుకోలేకపోయాడు. ఆయన యొక్క ఏడుపు ఎంత గట్టిగా ఉందంటే తన ఐగుప్తీ దాసులు దానిని విన్నారు, మరియు దీనిని గూర్చిన ఈ వార్త ఫరో యొక్క యింటి వరకు కూడా చేరింది (45:2).

లోపల నుండి పొంగివస్తున్న భావాలను ఆపుకోలేక మస్తీలో ఉన్న ఈ సహోదరుడు “నేను యోసేపును. నా తండ్రి యింక బ్రదికియున్నాడా?” అని గట్టిగా అరచాడు (45:3). ఈ మాటలు ఆ సహోదరులకు ఎంతటి దిగ్భ్రాంతిని కలిగించాయి అంటే వారు నివ్వెరపోయి స్పందించకుండా ఉండిపోయారు. వారు ఆశ్చర్యపడుటయే గాక, ఈ ఐగుప్తీయుని యొక్క సాన్నిధ్యాన్ని బట్టి మరియు ఆయన చేసిన ఈ ప్రకటనను బట్టి వారు భయపడిపోయారు (45:3). వారి మనస్సులలో అనేకమైన కలవర ఆలోచలను పరుగెత్తి ఉంటాయి: “ఎప్పుడో తప్పిపోయిన మన సహోదరుని పేరు ఈ మనిషికి ఎలా తెలిసి ఉంటుంది? ఇప్పటికే మరణించిన వ్యక్తి ఈయనే అని ఎందుకు ఈయన చెప్పుకొంటున్నాడు? ఒకవేళ ఈయన నిజంగా యోసేపు అయితే, ఎందుకు మనలను ఈ విధంగా చూస్తున్నాడు? మనలను కఠినంగా శిక్షించుటకు మునుపు తన సొంత ఆనందము కొరకు మనలను ఈ విధంగా ఇబ్బంది

పెడుతున్నాడా?" అనే ప్రశ్నలు వచ్చి ఉంటాయి.

తమ వైపు క్రూరమైన ముఖముతో, వారికి తీర్పుతీర్చి దండించాలని అనుకున్నట్లుగా, మామూలుగా చూసే ఐగుప్తీ నాయకుడిని యోసేపు సహోదరులు చూడలేదు. దీనికి బదులు, జాలిగల అశ్రులను విడుస్తున్న సున్నితహృదయుడిగా ఉండి ఆయనను తమకు సహోదరుడైన యోసేపుగా గుర్తించుకున్న ఒక వ్యక్తిని చూస్తున్నారు. దేవుడు కూడా దుర్మార్గులను శిక్షించుటలో ఆనందమును పొందే ఒక కఠినమైన న్యాయాధిపతి కాడు. ఆయన పాపులను ఎంతగా ప్రేమించాడు అంటే శిలువపై మరణించి పాపులు "నశింపక నిత్యజీవము" పొందులాగున తన ఏకైన కుమారుని ఇచ్చినవాడు ఆయన (యోహాను 3:16). యెరూషలేములోని తన ప్రజలు కూడా నశించడం యేసు చూచినప్పుడు ఆయన వారిని బట్టి జాలిపడి కన్నీటిని విడచాడు (మత్తయి 23:37, 38).

*క్షమాపణ సంధి చేయుటకు మార్గమును ఇస్తుంది.* యోసేపు యొక్క సున్నితమైన మాటలు మరియు జాలిగల అశ్రుదారలు తన సహోదరులతో తిరిగి సంధి చేయబడుటకు గల అవకాశాన్ని తెరిచాయి. ఆయనకు వారిపట్ల ఎటువంటి వైర భావములు లేవని లేదా వారిని దండించాలని ఆయన అనుకోవట్లేదు అని యోసేపు వెల్లడిచేశాడు. దీనికి విరుద్ధంగా, వారు ఆయనకు దగ్గరగా వచ్చి బానిసత్వమునకు వారు అమ్మివేసిన ఆ వ్యక్తే ఈ వ్యక్తని, ఆయన నిజంగానే తమ సహోదరుడని తెలుసుకొనులాగున యోసేపు వారిని ఆహ్వానించాడు (45:4). ఈ విధంగా చేస్తున్న అతని ప్రవర్తన అంతయు కూడా ఆయన వారిని క్షమించాడని – ప్రత్యేకంగా తన ప్రజల జీవితాలలో దేవుడు చేసే దైవసంకల్పికమైన కార్యములను గూర్చి గట్టిగా చెప్పినప్పుడు – సూచిస్తుంది. యోసేపు తన సహోదరులతో "అయినను నేనిక్కడికి వచ్చునట్లు మీరు నన్ను అమ్మివేసినందుకు దుఃఖపడకుడి; అది మీకు సంతాపము పుట్టింప నియ్యకుడి; ప్రాణరక్షణ కొరకు దేవుడు మీకు ముందుగా నన్ను పంపెను" అని అన్నాడు (45:5).

ఆ తరువాత ఆయన మాట్లాడుతూ ఆ దేశమును అప్పటికే రెండు సంవత్సరాలుగా పీడిస్తున్న ఆ కరవు ఇంకా ఐదు సంవత్సరాలు కొనసాగుతుందని తెలియజేశాడు. తీవ్రమైన ఆ క్షామము వలన, పండించుటకు ప్రజలకు పంటలు ఉండవు (45:6). వారికి పునఃనిశ్చయత ఇచ్చుటకు, క్షమాపణను గూర్చిన ఆయన ఆలోచనను మరలా పునరావృతం చేశాడు: "ప్రాణముతో కాపాడుటకును దేవుడు మీకు ముందుగా నన్ను పంపించెను" (45:7). ఒక విధంగా ఆయన, "నన్ను వదిలించుకొనుటకు మీరు ఏమి ప్రణాళిక అయితే రచించారో కాదు గాని, మన కుటుంబమును రక్షించుటకు మీ కార్యములను ఉపయోగించడం దేవుని ప్రణాళికయై ఉంది" అని అన్నాడు. తన సహోదరులు వేదన, అపరాధభావన, లేదా పగ తీర్చుకొంటాడేమో అనే భయముతో భారముగా ఉండకుండా యోసేపు చూచుకున్నాడు. తమ చిన్న సహోదరుని ఈతిబాధ నుండి తమను తాము తప్పించుకొనుటకు వారు చేసిన ప్రణాళికను కృపలో దేవుడు చేసిన సార్వభౌమ

ప్రణాళిక అధిగమించింది అనే విషయాన్ని యోసేపు పునరావృతం చేస్తూ చెప్పాడు. మూడవ సారి, కాని కొంతవరకు వ్యత్యాసమైన విధానంలో, ఆ మానవుల ప్రణాళిక ద్వారా కార్యరూపం దాల్చిన దైవిక ప్రణాళికను పునరుద్ఘాటించాడు. "కాబట్టి దేవుడేగాని మీరు నన్నిక్కడికి పంపలేదు. ఆయన నన్ను ఫరోకు తండ్రిగాను అతని యింటివారి కందరికి ప్రభువుగాను ఐగుప్తు దేశమంతటిమీద ఏలికగాను నియమించెను" అని ఆయన అన్నాడు (45:8).

ఒక విధంగా చూస్తే, "యోసేపు యొక్క కథనములో ఉన్న సంఘటనలన్నియు మానవ కార్యములకు అతీతంగా – అవి నైతికంగా సరైనవి అయినను కాకున్నను – మరియు వారి ద్వారా దేవుని ప్రణాళికలు ఎలా నేరవేరతాయో అనే విషయాన్ని వెల్లడిచేయుటకు సమకూడి జరుగుతాయి."[10] అంటే దీని ద్వారా "మేలు కలుగుటకు కీడు చేయాలి" మానవుడు అని చెప్పడం కాదు (రోమా. 3:8), కాని దేవుడు మానవుల వ్యవహారాలను తిరిగిరాయుటకు సమర్థుడు అని చెప్పడం. దేవుడు చెడునుండి మంచిని బయటకు తెచ్చి తన గొప్ప ప్రణాళికను – అనగా యోసేపు యొక్క కుటుంబమును మరియు అబ్రాహాము సంతానము అంతటిని రక్షించులాగున (45:5-9) – నెరవేర్చుటకు ఉపయోగించుకోగలడు. అదే సమయంలో, చుట్టూ ఉన్న దేశములకు కూడా దేవుడు విడుదలను తెచ్చాడు (41:55-57). ఇక్కడ ఉన్న ప్రధానమైన ఆలోచన ఏమంటే ఒక ఆత్మీయమైన వ్యక్తి జీవితములో వచ్చే మంచి మరియు చెడు సందర్భాలలో కూడా దేవుని యొక్క హస్తమును గ్రహించి, ఆయనను ప్రేమించువారికి మేలుకలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని ఆయనను నమ్మాలి (రోమా. 8:28). అట్టి ఒక ఆలోచన మనలను ద్వేషములను పెట్టుకొనుట నుండి లేదా మనకు అపకారము చేసినవారిపై ప్రత్యుపకారము తీర్చుకోవాలనే మన ఆలోచనలనుండి తప్పించాలి. యోసేపు తన సహోదరులను ఉదార స్వాభావముతో క్షమించినప్పుడు, ఆయన వారికి ఆదరణను అందించి సంధి చేయుటకు కావాల్సిన తలుపులు తెరిచాడు.

*ఎడబాటుకు గురైన వారినుండి క్షమాపణ అనునది ఐక్యతను మరియు సంధిని కోరుతుంది.* ఈ కుటుంబము అనేక సంవత్సరములుగా మంచి సంబంధములను అనుభవించలేదు. యోసేపును తన అన్నలు ఐగుప్తుకు తీసుకెళ్లే వర్తకులకు అమ్మివేసినందున వారినుండి ఆయన వేరుచేయబడ్డాడు. యాకోబు కనానులో తన కుమారులకు దగ్గరగానే జీవించినప్పటికీ, కొంత మేర ఆయన కూడా వారినుండి ఎడబాయబడిన వాడిగానే ఉన్నాడు. బహుశా, యోసేపు మరణమునకు యాకోబు తన కుమారులనే బాధ్యులుగా ఎంచి ఉంటాడు మరియు ప్రత్యక్షంగానో పరోక్షంగానో ఈ విషయంలో వీరు పాత్ర పోషించి ఉంటారని తన కుమారుల పట్ల అనుమానించి కూడా ఉంటాడు. అందువలననే, అధికమైన ధాన్యము కొరకు సహోదరులు ఐగుప్తునకు తిరిగెళ్లి తమతో బెన్యామీనును కూడా తీసుకెళ్లుటకు ఆశించినప్పుడు, వారి తండ్రి అన్నాడు, "మీరు నన్ను పుత్రహీనునిగా చేయుచున్నారు; యోసేపు లేడు; షిమ్యోను లేదు; మీరు బెన్యామీనును కూడ తీసికొనపోవుదురు; ఇవన్నియు

నాకు ప్రతికూలముగా ఉన్నవని" వారితో చెప్పాడు (42:36). యాకోబు తన కుమారులను అబద్ధికులుగా పరిగణించి వారిని కేవలం నమ్మలేదు అని ఈ మాటలు మనకు తెలుపుతున్నాయి.

ఐక్యతను మరియు సంధిని తిరిగి తెచ్చుటకు, యోసేపు తన కుటుంబము అంతటిని ఉద్దేశించిన తన ఉపన్యాసమును సూచనలతో ముగించాడు. తన సహోదరులు త్వరగా స్పందించి యాకోబు నొద్దకు ఇంటికి వెళ్లాలని వారిని బలవంతము చేశాడు. వారు ఏమని చెప్పాలంటే,

> నీ కుమారుడైన యోసేపు – దేవుడు నన్ను ఐగుప్తు దేశమంతటికి ప్రభువుగా నియమించెను, మా యొద్దకు రమ్ము, అక్కడ ఉండవద్దు; నీవు గోషెను దేశమందు నివసించెదవు; అప్పుడు నీవును నీ పిల్లలును నీ పిల్లల పిల్లలును నీ గొఱ్ఱెలమందలును నీ పశువులును నీకు కలిగినది యావత్తును నాకు సమీపముగా నుండును (45:9, 10).

మిగిలి ఉన్న ఐదు సంవత్సరాల కరవు కాలమునకు కావలసిన సమస్తమును, వారు బలహీనము కాకుండా ఉండునట్లు, వారికి సమృద్ధిగా దయచేస్తానని కూడా యోసేపు వారికి వాగ్దానము చేశాడు (45:11).

తన సహోదరుల ద్వారా అందించబడిన సమాచారము ద్వారా దేవుడు ఆయనను ఆశీర్వదించి "ఐగుప్తు దేశమంతటికి ప్రభువు"గా చేశాడు అని యోసేపు తన తండ్రికి చెప్తున్నాడు. ఆయన అందుకున్న ఈ పిలుపు మెసొపొతామియాలో అబ్రాహాము పొందుకొనిన దైవిక పిలువంటిదే అనే విషయాన్ని యోసేపు యాకోబు యొక్క మనస్సులో ముద్ర వేయాలని అనుకున్నాడు: అక్కడ అబ్రాహామునకు దేవుడు తన దేశము నుండి బయలుదేరి కనాను దేశమునకు, అనగా దేవుడు ఆయనను బహుగా ఆశీర్వదించే దేశమునకు వెళ్లవలసినదిగా చెప్పాడు (12:1-5). అలాగే యాకోబు కూడా ఏశావు ఉగ్రత నుండి పారిపోతున్నప్పుడు దేవుడు ఆయనకు ఇచ్చిన సూచనలు మరియు వాగ్దానములతో పోల్చితే (28:10-17) ఈ పిలుపు కూడా అంతటి వ్యత్యాసమైనది కాదు. దేవుని యొక్క ఆజ్ఞను ఎన్నడూ వాదించకూడదు లేదా వ్యతిరేకించకూడదు; కాని, భౌతికమైన కుటుంబమును రక్షించుటకును మరియు దానిని సంధిచేయుటకును అది అవసరమైయున్నది.

యోసేపు ఇచ్చిన సందేశమును తన తండ్రికి అందించడం అనేది ఈ సహోదరులకు ఒక గొప్ప పనే. యోసేపు బ్రదికియున్నాడు అనే శుభవార్తతో పాటు, వారు ఆయనను బానిసత్వములోనికి ఎలా అమ్మివేశారో అనే దుర్వార్తను కూడా యాకోబుకు వారు తెలపాలి. ఇంత కాలంగా తమ తండ్రి పట్ల మనసులేనివారిగా మరియు ఆయనను మోసగించుట ద్వారా క్రూరంగా ప్రవర్తించిన తరువాత కూడా, ఆ కుటుంబములో నిజమైన స్వస్థత జరగాలంటే వారు తమ పాపములను ఒప్పుకొనవలసినవారిగా ఉన్నారు. కాగా, యోసేపు బంధకమును ఒక విషాదము నుండి ఆశీర్వాదమునకు మార్చినది దేవుడే అనే విషయాన్ని వారు

గుర్తించనంతవరకు నిజమైన స్వస్థత లేదా సంధి అనునది సాధ్యపడే విషయం కాదు. ఫరోకు ఆయన చేసే సేవ కేవలం యాకోబు కుటుంబమును ఆశీర్వదించడం మాత్రమే కాదు గాని, తూర్పు మధ్యధరా ప్రాంతములో ఉన్న అనేకమైన ప్రజలకు కూడా అది ఆశీర్వాదకరంగా ఉంటుంది.

కథనములోని ఈ భాగమునకు ముగింపులో, కథకుడు యోసేపు మరియు అతని సహోదరుల హృద్యమైన పునఃకలయికను గూర్చి చెప్తున్నాడు, ప్రత్యేకంగా బెన్యామీను గూర్చి. తన సహోదరుడు ఐగుప్తుకు అపహరింపబడుటకు మునుపు రాహేలు యొక్క ఈ కనిష్ట కుమారుని వయసు ఎంతో వాక్యము బయలుపరచుటలేదు. యోసేపు ఐగుప్తీయునిగా అగుపించుకోవాలని ఎంత ప్రయత్నించినప్పటికీ తన హెబ్రీ పదాలను బట్టి మరియు తన మౌఖిక లక్షణాలను బట్టి బెన్యామీను, అలాగే తన సహోదరులు అందరు కూడా ఆయనను గుర్తించారు. వారి దీర్ఘకాలపు ఎడబాటు తరువాత, బెన్యామీను మెడమీద యోసేపు పడి ఏడ్చి తరువాత యోసేపు మెడపైన బెన్యామీను పడి ఏడ్చి ఈ విధంగా భావోద్వేగభరితమైన కలయిక వారికి కలిగింది (45:14). అప్పుడు యోసేపు తన సహోదరులందరినీ ముద్దాడి వారిపైబడి ఏడ్చాడు. సహోదరులవైపు నుండి ఎట్టి పశ్చాత్తాపమును లేదా ఏడ్పును ఈ వాక్యము ప్రస్తావించుటలేదు గనుక (45:15), సంధి కార్యము కేవలం పాక్షికమే. పెద్దవారైన సహోదరులు ఇంకను యోసేపుకు భయపడుతూనే ఉన్నారు, మరియు వారు తమ పాపమును ఒప్పుకొని వారిని క్షమించవలసినదిగా యోసేపును బ్రతిమాలుకొనుటకు వారికి చాలా సంవత్సరాలు పట్టినది (50:15-17).

భౌతికమైన కుటుంబ సభ్యుల మధ్యనో లేదా ఆత్మీయమైన కుటుంబీకుల మధ్యనో ఈ ఎడబాటు వచ్చినపుడు, సంపూర్ణమైన సంధి పాపములు ఒప్పుకొనుటకు మరియు క్షమాపణకు నడిపించునట్లు (యాకోబు 5:16; 1 యోహాను 1:9) దైవచిత్తానుసారమైన దుఃఖము ఉన్నప్పుడే (లూకా 15:18-21; 2 కొరింథీ. 7:10) వస్తుంది. ఈ క్రియలు వాయిదా వేయకూడదు ఎందుకంటే కాలము గడిచేకొలదీ హృదయములు బండమారుతాయి. క్షమాపణతో పాటు, అపరాధులు "అత్యధికమైన దుఃఖములో మునిగిపోయి" (2 కొరింతీ. 2:6-8) మరియు తమ నిరీక్షణను "తుదముట్టుకు కనుపరచ"కుండా విఫలమైపోతారేమో (హెబ్రీ. 3:6; 6:11) అని, ప్రేమగల ఆదరణను కూడా చూపించాలి. యోసేపు యొక్క సహోదరులు అతనితో తమ పాపమును ఒప్పుకోకుండా తమ తండ్రియైన యాకోబు మరణించేవరకు వాయిదా వేసినప్పటికీ, దేవుడు వారిని ఆశీర్వదిస్తూనే ఉంటాడు మరియు అబ్రాహాము అతని సంతానమువారికి ఆయన చేసిన వాగ్దానములను (12:1-3; 15:5-21) నేరవేరుస్తాడనే నిరీక్షణను మాత్రం గట్టిగానే పట్టుకొని ఉన్నారు.

సూచనలు

[1]Elmer A. Martens, "לְךָ," in *TWOT*, 1:92. [2]"తండ్రి" అనే మాట కొన్నిసార్లు రాజు ప్రవక్తను సంబోధించేటప్పుడు (2 రాజులు 6:21) లేదా తన ప్రభుత్వములోని ఉన్నతస్థాయి అధికారిని సంబోధించేటప్పుడు ప్రయోగించేవాడు (యెషయా 22:20, 21). ఈ పదము యాజకునికి (న్యాయాధి. 17:10; 18:19) లేదా ఒక ఉన్నత సైనికాదికారికి కూడా (2 రాజులు 5:13) ప్రయోగించబడుతుంది. [3]Kenneth A. Mathews, *Genesis 11:27—50:26*, The New American Commentary, vol. 1B (Nashville: Broadman & Holman Publishers, 2005), 815. [4]John T. Willis, *Genesis*, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1979), 426. క్రీ.పూ. పదమూడవ శతాబ్దమునకు చెందిన ఒక ఐగుప్తీ పత్రిక ఒకటి ఎదోముకు చెందిన బెడూయిన్ తెగలు వారు (కాపరులు) వారిని మరియు వారి పశువులను సజీవంగా ఉంచుకొనులాగున ఎలా ఈ ప్రాంతమునకు సామీప్యతను పొందారో నమోదు చేస్తుంది. (John A. Wilson, trans., "The Report of a Frontier Official," in *Ancient Near Eastern Texts: Relating to the Old Testament*, 3d ed., ed. James B. Pritchard [Princeton, N.J.: Princeton University Press, 1969], 259.) [5]"Targum of Onkelos," in *The Targums of Onkelos and Jonathan Ben Uzziel on the Pentateuch*, trans. J. W. Etheridge (New York: KTAV Publishing House, 1968), 142. [6]Victor P. Hamilton, *The Book of Genesis: Chapters 18—50*, The New International Commentary on the Old Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1995), 581. [7]טוּב (*tub*) అను హెబ్రీ పదమును NASB "శ్రేష్టమైన" అని అనువదించగా KJV అనువాదము "మంచి" అని అనువదించింది; ఇక్కడ ఈ పదము యోసేపు కుటుంబము పొందుకొనబోయే "భౌతికమైన వస్తువులను" సూచిస్తుంది (45:18, 20, 23). (Andrew Bowling, "טוּב," in *TWOT*, 1:346.) [8]సూక్ష్మంగా పరిశీలిస్తే, అబ్రాహాము కాలములోనే ఐగుప్తుదేశము మనుష్యులకు మరియు జంతువులకు కూడా ఆహారమును పెట్టే దేశముగా చూడబడేది (12:10). అయినప్పటికీ, ఫరోతో కలిసి ఐగుప్తీ మనుష్యులు ఔదార్యమునకు గాని లేదా ఆతిథ్యానికిగాని పేరొందినవారు కారు; కాని, వారు తరచూ పరదేశులను హత్యచేసి వారి భార్యలను వారికొరకు బలవంతంగా తీసుకొనేవారు గనుక ఎప్పుడు వారంటే ప్రజలు భయపడేవారు. యోసేపు కాలములో చోటుచేసుకున్న ఈ కరవు సుదీర్ఘకాలం ఉంది మునుపు వచ్చిన క్షామములతో పోల్చితే తీవ్రమైనదిగా ఉన్నది. ఇది సుస్పష్టం ఎందుకంటే, అబ్రాహాము మరియు అతని అనుచరగణం ఐగుప్తును విడచి కనాను దేశమునకు వచ్చుటకు బలవంతము చేయబడగా, అక్కడ వాక్యము వారిని పశువులయందు సంపన్నులైయుండి, వారి దేశములో వృద్ధిపొందారు అని చెప్తుంది (13:1-6). [9]తరువాత కాలంలో యాకోబు కూడా జ్యేష్ఠత్వపు హక్కును నిర్లక్ష్యము చేసి క్రమమును మరియు ఆశీర్వాదాల ప్రాధాన్యతను త్రిప్పి యూదా మరియు యోసేపులకు వాటిని ఇస్తాడు (49:8-10, 22-26). [10]Gordon J. Wenham, *Genesis 16—50*, Word Biblical Commentary, vol. 2 (Dallas: Word Books, 1994), 432.